క్లుప్తంగా

ప్రజా సహకారంతోనే పార్కుల మనుగడ

- నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములనాయుడు



పార్కులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న నగరపాలక కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు

విజయనగరం: ప్రజా సహకారంతోనే పార్కులకు మనుగడని ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. నగరంలోని వివిధ పార్కులను సోమవారం ఆయన సందర్శించారు. ముందుగా పీఎస్సార్ కాలనీలో ఉన్న పార్కు వద్దకు చేరుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. చెట్లు దట్టంగా పెరిగే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో ఉన్న సచివాలయ సిబ్బందికి మొక్కల పెంపకం బాధ్యతలను అప్పగించారు. ఇప్పటికే నగరంలో ఆక్సిజన్, మహిళా పార్కులను ఏర్పాటు చేశామన్నారు. అలాగే సైంటిఫిక్, ఈకో పార్కుల ఏర్పాటుకు కూడా కృషి చేస్తున్నట్లు చెప్పారు. పీఎస్సార్ పార్కులో 400 వరకు మొక్కలను నాటుతున్నామన్నారు.

నియామకం



పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస గ్రామానికి చెందిన మజ్జి జగ్గునాయుడు ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంఘం యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు ఆకుల అప్పల సూరినాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జగ్గునాయుడును పలువురు అభినందించారు.

సామర్థ్యానికి తగిన బోధన

- ఎంఈఓ రాజ్‌కుమార్



చిన్నారుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ రాజ్‌కుమార్

పూసపాటిరేగ: దివ్యాంగ పిల్లల సామర్థ్యానికి అనుగుణంగా బోధన చేపట్టాలని ఎంఈఓ ఎ. రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాధారణ పిల్లల్లాగే వీరిలో కూడా సామర్థ్యం ఉంటుందని, దీన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. సమాజంలో జరిగే అన్ని కార్యక్రమాలలో పాల్గొనేటట్లు చేయడంతో వారిలో ఆత్మన్యూనతా భావం పోతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.నీలిమ, సహిత ఉపాధ్యాయులు ఎస్. బంగారునాయుడు, ఎం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యం



గుంతలను పూడ్చుతున్న పోలీసులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను సోమవారం స్థానిక పోలీసులు పూడ్చారు. ఏఎస్సై పి.సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రావెల్‌ను తీసుకువచ్చి పూడ్చడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

విజయనగరం ఫోర్ట్: బాలలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. ఫూల్‌బాగ్ మోడల్ స్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని తెలిపారు. అమ్మఒడి పథకం వల్ల డ్రాపౌట్స్ తగ్గాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పర్వీన్, తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకుందాం..

విజయనగరం ఫూల్‌బాగ్: 'ప్రధాని మోదీ నుంచి దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో సీపీఐ నేతృత్వంలో చేపట్టనున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అమర్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీపీఐ చేపట్టే ఈ బస్సుయాత్రలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, రాజ్యసభ సభ్యుడు బినయ్ విశ్వం, జాతీయ కార్యదర్శులు అమర్‌జిత్ కౌర్, కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



50వ డివిజన్‌లో లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 50వ డివిజన్ రాళ్లమాలపల్లి పరిధిలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో పథకాలు అందుతున్నాయని తెలిపారు. దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే ప్రభుత్వ పథకాల నిధులు జమ కావడంతో ప్రజల మోములో ఆనందం కనిపిస్తోందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి మాట్లాడుతూ, తమ డివిజన్ల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మాట తప్పని మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన వారందరికీ పథకాలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటిరాజు, నడిపిల్లి ఆదినారాయణ, కనకల నాగవల్లి, తదితరులు పాల్గొన్నారు.

37వ డివిజన్‌లో..

నగరంలోని 37 డివిజన్ కుసుమ గజపతినగర్ ప్రాంతం నుంచి ప్రారంభమైన గడప గడపకు.. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోలగట్ల తమ్మన్న శెట్టి, జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ వింత ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ విధానాలు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

జగనన్నతోనే సుభిక్ష పాలన

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



నెల్లిమర్ల రూరల్: వృద్ధురాలికి బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి జగనన్న నాయకత్వంలో రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బుచ్చన్నపేట, పినతరిమి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి ఇంటింటా పర్యటించి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళుతున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. స్థానికులు సీసీ కాలువలు, రహదారుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా..పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు.. : ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ, ప్రజా సమస్యలు పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజల కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తుంటే, ప్రతిపక్షాలు పనికట్టుకొని ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, సీనియర్ నేత మత్స సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ అంబళ్ల కిరణ్, ఎంపీటీసీ సభ్యుడు బొంతు పురుషోత్తం, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణకు చర్యలు

- కోనేరులను పరిశీలించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



పెద్దచెరువు పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర పాలక సంస్థ కమిషనర్, తదితరులు

విజయనగరం: నగరంలోని చెరువుల సుందరీకరణకు స్థానిక శాసనసభ్యుడు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నడుం బిగించారు. ఇప్పటికే నగరంలోని కొన్ని చెరువులను అభివృద్ధి చేసి, స్థానికులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించిన విషయం తెలిసిందే. మిగిలిన మరికొన్ని చెరువులు నిరాదరణకు గురై ఉనికి కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో అటువంటి చెరువులను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నగరపాలక సంస్థ, ఇరిగేషన్ అధికారులతో కలసి సోమవారం జిల్లా కేంద్రంలో పర్యటించారు. తొలుత పెద్ద చెరువు ట్యాంక్‌బండ్ మార్గంతో పాటు, కర్రల మార్కెట్ వైపు పరిశీలించారు. అనంతరం బుచ్చన్న కోనేరు, నల్లచెరువు, కోమటి చెరువు, అయ్యకోనేరులను పరిశీలించి, వాటి పరిస్థితిపై చర్చించారు. కొన్నిచోట్ల పనికిరాని మొక్కలు పెరగడంతో పాటు అపరిశుభ్ర వాతావరణం ఉండడంతో సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొత్తంగా ఈ చెరువులను ఆధునీకరించి, ఆహ్లాదకర వాతావరణాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఆయన వెంట నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌చార్జ్‌లు కంటుభుక్త తవిటిరాజు, బొద్దాన అప్పారావు, కాళ్ల సూరిబాబు, ఇంజినీరింగ్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

దిశా చట్టంపై అవగాహన తప్పనిసరి

- ఎస్పీ ఎం.దీపిక



మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: దిశా చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. సోమవారం స్థానిక లార్వెన్స్ క్యాంపస్‌లో పోలీస్ శాఖ, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలోఆమె మాట్లాడుతూ, ఆడపిల్లలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తమ సమస్యలను నిర్భయంగా చెప్పాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు సుబ్బారావు, వెంకటరావు, కె.సంతోష్, అభిషేక్, రవిపాల్గొన్నారు.

పుష్పాలంకరణలో శ్రీనివాసుడు



ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

విజయనగరం టౌన్: నగరంలోని టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో కొలువైన శ్రీనివాసుడు సోమవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు పీవీ.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు.

నగర అభివృద్ధే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ నాయకులు



11వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: నగర అభివృద్ధే తమ ధ్యేయమని మేయర్ విజయలక్ష్మి, పార్టీ నాయకుడు కోలగట్ల కృష్ణారావు అన్నారు. నగరంలోని 11వ డివిజన్ అంబటిసత్రం నుంచి ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల మంజూరుపై ఆరా తీశారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, వెంపడాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ, అర్హత ఉంటే చాలు అన్ని పథకాలు వర్తింపజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ విషయాన్ని ప్రజలందరూ తెలుసుకొని రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి గెలిపించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నగరంలోని ప్రతి ప్రాంతాన్నీ అభివృద్ధి చేస్తూ నగరానికి కొత్త అందాలను తీసుకువస్తున్నారన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధకశక్తి

- సీడీపీఓ ఎస్తేరు రాణి



పూసపాటిరేగ: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న సీడీపీఓ ఎస్తేరురాణి

పూసపాటిరేగ: తల్లిపాలు తాగడం వల్ల చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని భోగాపురం ఐసీడీఎస్ పీఓ ఎస్తేరు రాణి అన్నారు. మండలంలోని పేరాపురంలో సోమవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. చాలామంది బాలింతలు ఆరోగ్యం క్షీణిస్తుందనే అపోహతో పిల్లలకు పాలివ్వడానికి వెనకాడుతున్నారన్నారు. ఇటువంటి అపోహలను నమ్మవద్దని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణను (రేషన్ సరుకులు) గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌతు శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు పి. తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ మహేష్, మాజీ సర్పంచ్ బొంతు రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, కార్యకర్తలు చిన్నమ్మలు, శకుంతల, అనిత, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలకు మించిన పౌష్టికాహారం లేదు

విజయనగరం ఫోర్ట్: బిడ్డకు తల్లి పాలకు మించిన పౌష్టికాహారం మరొకటి లేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ అన్నారు. స్థానిక బొత్సపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ, తల్లి పాలు అమృతంతో సమానమని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శ్యామల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఏపీ ఎన్‌జీఓ ప్రతినిధులు

డెంకాడ: ఈ నెల 21,22వ తేదీల్లో నిర్వహించనున్న ఏపీ ఎన్‌జీఓల రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సంఘ నాయకులతో కలసి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం ఆవిష్కరించారు. మోపాడలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ, విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మహా సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొమ్మూరి దుర్గారావు, సంతోష్, జగదీష్, ఎ.సుధాకర్, పి.కృష్ణవేణి, లక్ష్మణరావు, సత్యనారాయణ, రమణ, భాస్కర్, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు..

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- రూ.83 లక్షలతో నిర్మించిన బీటీ రహదారి ప్రారంభం



బుచ్చన్నపేట జంక్షన్‌లో బీటీ రహదారి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నెల్లిమర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రెండు కళ్లు లాంటివని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని బుచ్చన్నపేట జంక్షన్ నుంచి పెదతరిమి వరకు రూ. 83 లక్షలతో బీటీ రహదారి నిర్మించగా.. అందుకు సంబంధించిన శిలాఫలకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, నాయకులు కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తిచేసి ప్రారంభిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో బీటీ రహదారులు ఏర్పాటు చేశామని తెలిపారు. టీడీపీ హయాంలో గ్రామాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారన్నారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, సీనియర్ నేత మత్స సత్యనారాయణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ అంబళ్ల కిరణ్, ఎంపీటీసీ సభ్యుడు బొంతు పురుషోత్తం, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ రమణరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

డెంకాడ: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయడం వల్ల అన్ని విధాలుగా మేలు ఉంటుందని ప్రకృతి వ్యవసాయ కార్యకర్త బి.సుజాత అన్నారు. మండలంలోని చొల్లంగిపేటలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రంను (ఎన్‌పీఎస్) సర్పంచ్ కోరాడ కనకరాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగం వల్ల చాలా అనర్థాలు వస్తున్నాయన్నారు. అందుబాటులో ఉండే వస్తువులు, పదార్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తొత్తడి శ్రీను, ఏఈఓ ప్రశాంతి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

నెల్లిమర్ల రూరల్:

మండలంలోని తంగుడుబిల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... సతివాడ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తిని టాటా మ్యాజిక్ వాహనం ఢీ కొట్టి, అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకుపోయింది. ఈ సంఘటనలో ద్విచక్రవాహనదారుడితో పాటు టాటా మ్యాజిక్ వాహనంలో ఉన్న పదిమందికి స్వల్ప గాయాలయ్యాయి.

సిబ్బందికి వైద్య పరికరాలు అవసరం

- ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి



సిబ్బందికి వైద్య పరికరాలను అందజేస్తున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: శత్రువులతో యుద్ధం చేయడానికి ఆయుధాలు ఎంత అవసరమో.. పల్లెల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంలు, ఎంహెచ్‌పీలకు వైద్య పరికరాలు అంతే అవసరమని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలో ఉన్న ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరిసరాల్లో ఖాళీ టైర్లు, బోండాలు, పనికిరాని వస్తువులు ఉంటే వర్షాలకు అందులో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ, గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా నులిపురుగులను నియంత్రించేందుకు ప్రభుత్వం మందులు సరఫరా చేస్తోందని, ఈ నెల 10న అన్ని పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు మందులు వేయాలని ఎంఈఓ రమణమూర్తికి సూచించారు. వైద్య సిబ్బంది వైద్య పరికరాలను సమకూర్చేందుకు కృషి చేసిన వైద్యాధికారి తిరుపతిస్వామిని ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం ఏఎన్‌ఎం, ఎంహెచ్‌పీలకు వైద్య పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, సీడీపీఓ ఎస్తేరు రాణి, ఈఓపీఆర్‌డీ సురేష్, సర్పంచ్ పూడిక నూకరాజు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి 'మండల్' పోరాటం



మాట్లాడుతున్న బీసీ సంఘ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: అణగారిన వర్గాల అభ్యున్నతికి బీపీ మండల్ పోరాడారని జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక ప్రశాంతినగర్‌లో బీపీ మండల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ గదుల సత్యలత, జిల్లా కన్వీనర్ బొద్దాన అప్పారావు మాట్లాడుతూ, బీహార్ ఏడో ముఖ్యమంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా, సంఘసంస్కర్తగా స్వర్గీయ బిందేశ్వర ప్రసాద్ మండల్ పేదల పక్షాన పోరాడాని చెప్పారు. వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతి కోసం విద్య, ఉద్యోగం, రాజకీయం వంటి అంశాలను కలుపుకొని మొత్తం 40 సిఫార్సులను ప్రభుత్వానికి మండల్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం నియోజకవర్గ అధ్యక్షుడు వేముల శివప్రసాద్, జిల్లా మహిళా ప్రెసిడెంట్ కలపర్తి లక్ష్మి, విద్యార్థి విభాగం ప్రెసిడెంట్ బాలి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చైర్‌పర్సన్ సరోజిని, తదితరులు

నెల్లిమర్ల రూరల్:

పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సోమవారం శ్రీకారం చుట్టారు. ఏక కాలంలో మొత్తం ఆరు వార్డుల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, తదితరులు స్థానిక వార్డు కౌన్సిలర్లతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రత్యేక చొరవతో 9వ వార్డులో రూ.10 లక్షలు, 8వ వార్డులో రూ.9 లక్షలు, 11వ వార్డులో రూ. 4 లక్షలు, 7వ వార్డులో రూ.6 లక్షలు, 4వ వార్డులో రూ.2.08 లక్షలు, 2వ వార్డులో రూ.5.08 లక్షల చొప్పున సీసీ రహదారులు, కాలువల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కారుకొండ వెంకటకృష్ణారావు, కౌన్సిలర్లు బూర సుజాత, మైపాడ ప్రసాద్, చిక్కాల సంతోష్, మొయిద శ్రీను, పైల భారతి, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, తదితరులు పాల్గొన్నారు.